కంటి అద్దాలు పంపిణీ

తిరుపతి టౌన్ : డాక్టర్ వై.యస్.ఆర్. కంటి వెలుగు పథకం ద్వారా లబ్ధిదారులకు కంటి అద్దాలను నగర మేయర్ డాక్టర్ శిరీష అందించారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని గతంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే జగనన్న ధ్యేయమని, అందులో భాగంగా ఉచిత వైద్యం అందించారని, కంటికి సంబంధించి పరీక్షలు నిర్వహించడం జరిగింది. శనివారం 27వ డివిజన్ సంబంధించి కంటి అద్దాలను లబ్ధిదారులకు అందజేశారు.

12వ రోజు

'ఏకాదశి' రోజు 'జగనన్న భిక్షాటన'
పండగరోజు నేతల నిరాహారదీక్ష

శిబిరాల్లో అంగన్‌వే(వా)డి

పుత్తూరులో..

ప్రజాశక్తి - యంత్రాంగం

అసలే శీతాకాలమ్.. చలి గజగజ వణికిస్తోంది.. అయినా అంగన్‌వాడీల సమ్మె శిబిరాల్లో మాత్రం వేడి సెగలు రగులుతున్నాయి.. రోజురోజుకూ శిబిరాల్లో అంగన్‌వాడీల నినాదాలు హోరెత్తుతున్నాయి.. వేతనం పెంచేంత వరకూ వెనకడుగు వేసేది లేదని ఉద్ఘాటిస్తున్నారు. గత 12 రోజులుగా ప్రతిరోజూ శిబిరం వద్దకు ఉదయం 9 గంటలకల్లా చేరుకోవడం, సాయంత్రం 4 గంటల వరకూ శిబిరాల్లోనే ఉంటూ సమ్మెను విజయవంతంగా అంగన్‌వాడీలు కొనసాగిస్తున్నారు. వైకుంఠ ఏకాదశి రోజు రేణిగుంటలో గుడి ముందు అంగన్‌వాడీలో 'జగనన్న భిక్షాటన' చేశారు. ప్రతి శిబిరంలోనూ ప్రాజెక్టు పరిధిలోని ప్రధాన నేతలు శనివారం నిరాహారదీక్ష నిర్వహించారు.

– పుత్తూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మెకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మద్దతు పలికారు. ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యిందన్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకూ సమ్మెకు తమ మద్దతు ఉంటుందన్నారు. మంత్రి ఆర్‌కె రోజా స్పందించి సిఎం జగన్మోహన్‌రెడ్డితో మాట్లాడి అంగన్‌వాడీలకు న్యాయం చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ 26వ తేదీ లోపు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే అన్ని రాజకీయ పార్టీలతో మాట్లాడి అంగన్‌వాడీల సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. జగన్మోహన్‌రెడ్డి రూ.500 కోట్లతో పెద్ద భవనం కట్టుకున్నారని, అంగన్‌వాడీలకు వేతనం పెంచడానికి తర్జన భర్జన పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, ఎ.విజయ్, డి.మహేష్, కెఆర్ సుబ్రమణ్యం, యాసిన్‌బాష, అంగన్‌వాడీలు మునికుమారి, విజయకుమారి, ధనమ్మ, రాధ తదితరులు పాల్గొన్నారు.

– రేణిగుంట గుడి వద్ద వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని అంగన్‌వాడీ అక్కచెల్లెళ్లు కొంగుపట్టి 'జగనన్న భిక్షాటన' చేపట్టారు. 'ఏడు కొండలవాడా గోవింద.. జగనన్న మనస్సు మార్చవయ్యా..' అంటూ నినాదాలు చేశారు. సిఐటియు మండల కార్యదర్శి కె.హరినాథ్, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రేణిగుంట ప్రాజెక్టు అధ్యక్షురాలు ధనమ్మ నాయకత్వం వహించారు.

– చంద్రగిరిలో 'మా ఉసురు ఊరికే పోదు' అంటూ నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా నాయకులు ఎస్.జయచంద్ర, ఆర్.లక్ష్మి, యూనియన్ రాష్ట్ర కోశాధికారి వాణిశ్రీ పాల్గొన్నారు.

– సత్యవేడులో ఎఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి చంద్రవాబు మద్దతు తెలిపారని సిఐటియు డివిజన్ కార్యదర్శి రమేష్ తెలిపారు. అంగన్‌వాడీలు నిర్మల, శాంతి, ఇందిర, సుభాషిణి, భువన తదితరులు పాల్గొన్నారు.

– బిఎన్ కండ్రిగలో కళ్లకు గంతలు కట్టుకుని సమ్మె కొనసాగించారు. శోభ, సుదర్శన తదితరులు పాల్గొన్నారు.

– నాయుడుపేటలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, డాక్టర్ రామసుబ్బయ్య మద్దతు ప్రకటించారు. జీతం పెంచమని అడుగుతుంటే 'చీరలు కొనిచ్చా.. జాకెట్లు కొనిచ్చా' అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. విశాఖలో జగన్మోహన్‌రెడ్డి ఉండటానికి రూ.525 కోట్లు ఖర్చు పెట్టారని, స్మార్ట్ మీటర్ల కోసం 20 కోట్లు ఖర్చు చేస్తున్నారని, ఇదంతా ఎవరికోసమని హెచ్చరించారు. ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ, మేరి, ప్రమీల, సిఐటియు నాయకులు ఎస్.ముకుంద, మహేష్ పాల్గొన్నారు.

– గూడూరులో అంగన్‌వాడీ కార్యకర్తలను రోడ్డు ఎక్కించిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కిందని, పోరాటంలో తాము వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. ప్రదర్శనగా టవర్‌క్లాక్ వద్దకు చేరుకుని రాస్తారోకో, మానవహారం నిర్వహిస్తూ కోలాటం ప్రదర్శించారు. తెలంగాణా కొత్త ప్రభుత్వం అంగన్‌వాడీలకు 18వేలు ఇస్తామని వాగ్దానం చేసిన విషయాన్ని జగన్ ప్రభుత్వం గుర్తించాలన్నారు. నాయకులు ఎ.ఇంద్రావతి, జోగి శివకుమార్, బివి రమణయ్య పాల్గొన్నారు.

– తిరుపతిలో ఏకాదశి పురస్కరించుని 'కంటి తుడుపు జీవోలు వద్దు.. సమస్యలు పరిష్కరించాలి' అంటూ నల్లరిబ్బన్లు కట్టుకుని దీక్ష కొనసాగించారు. వైకుంఠ ఏకాదశి పండుగ రోజూ అంగన్‌వాడీలో సమ్మె శిబిరంలోనే నిరసనలో ఉన్నారు. నాగరాజమ్మ, ఎల్లమ్మ,రాజేశ్వరి, గంగాదేవి, నాగరత్నలు దీక్ష చేపట్టారు. తమకు ఎంతో పవిత్రమైన ఏకాదశి రోజు తమను పస్తులతో ఉంచి జగన్ పుణ్యం మూట గట్టుకున్నారన్నారని ఎద్దేవా చేశారు. ప్రజానాట్యమండలి కన్వీనర్ రాజు బృందం దీక్షా శిబిరం వద్ద మద్దతు తెలియజేసి విప్లవగీతాలను ఆలపించారు.

– వెంకటగిరిలో ప్రాజెక్టు కార్యదర్శి స్వరూపరాణి ఆధ్వర్యంలో నిరాహారదీక్ష బూనారు. యూనియన్ నాయకులు మంజుల, ప్రసన్న పాల్గొన్నారు.

– సూళ్లూరుపేటలో సిపిఎం జిల్లాకార్యదర్శి వందవాసి నాగరాజు సంఘీభావం తెలిపారు. నాయకులు పద్మనాభయ్య, పి.మనోహర్, లక్ష్మయ్య, అంగన్‌వాడీ నాయకులు హైమావతి పాల్గొన్నారు.

గూడూరులో..

జేసీ శుభం భన్సల్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ జిల్లా కలెక్టరేట్‌లో శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2020 ఐఎఎస్ బ్యాచ్ కు చెందిన వీరు తొలి పోస్టింగ్ రంపచోడవరం సబ్ కలెక్టర్ గా విధులు చేపట్టి పలు రకాల ప్రజా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారు కొలువైన తిరుపతి జిల్లాలో జెసి గా పని చేయడం తన అదష్టంగా భావిస్తున్నానని, ప్రజా సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని, ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలను సమర్థవంతంగా అమలు చేయడానికి, ఎన్నికలు పారదర్శకంగా సజావుగా జరుపుటలో తన వంతు కషి చేస్తానని తెలిపారు. పలు రెవెన్యూ అంశాలపై జెసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, ఎస్డిసి శ్రీనివాసరావు,కలెక్టరేట్ ఎఓ జయరాములు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు నూతన జెసి కి శుభాకాంక్షలు తెలిపారు.



నారాయణాద్రి ఆస్పత్రిలో..

ఆస్టర్ నారాయణాద్రిలో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రిలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగం నందు అరుదైన శాస్త్ర చికిత్స నిర్వహించినట్టు సి ఓ ఓ శ్రీధర్ తెలిపారు. స్థానిక రేణిగుంట రోడ్డు లోని ఆసుపత్రి వద్ద వైద్య బందంతో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోయకొండకు చెందిన ధనలక్ష్మి ఆవులు మేపుకుంటూ జీవనం సాగిస్తుండేది. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం వారి ఎద్దు ఆమెని ఎడమ కాలు తొడ భాగంలో గట్టిగా పొడిచింది. దీంతో తీవ్ర రక్తస్రావం మై కింద పడింది. కుటుంబ సభ్యులు స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ వైద్యుల సూచన మేరకు తిరుపతి ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల ఆమెని పరిశీలించి, కాలికి రక్తప్రసరణ జరగకపోవడం వల్ల పూర్తిగా చచ్చుబడిపోయిందని తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ విజయకుమార్ రెడ్డి ఆమెను పరిశీలించి, వెనువెంటనే ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లి ప్లాస్టిక్ సర్జరీ ద్వారా కత్రిమ రక్తనాళాలను అమర్చి, ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారు. అరుదైన శాస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించిన వైద్య బందాన్ని సి ఓ ఓ అభినందించారు. బాధితురాలు కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మహతిలో 'ఆటా' సాంస్కృతిక పోటీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

సామాజిక సేవ కార్యక్రమాలతో అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) ఎల్లప్పుడూ ముందుండి తగిన సహకారాన్ని అందిస్తుందని ఆటా ఎలెక్ట్ ప్రెసిడెంట్ జయంత్ చల్లా స్పష్టం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జయంత్ మాట్లాడుతూ 1991లో ప్రారంభమైన అమెరికన్ తెలుగు అసోసియేషన్ నాటి నుండి నేటి వరకు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుందన్నారు. డిసెంబర్ 10 నుండి 30వ తేదీ వరకు అమెరికన్ తెలుగు అసోసియేషన్ రెండు భాగాలుగా చేరి ఈ సేవా కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్తున్నామన్నారు. ఆటా సేవా కార్యక్రమాలు విజయవంతం అవ్వాలని శ్రీశైలం మల్లికార్జున స్వామి క్షేత్రంలో ప్రారంభించామన్నారు. సమీప నల్లమల అడవుల్లోని చెంచులకు అమెరికా నుండి తీసుకువచ్చిన బట్టలను అందించామన్నారు. సమీప ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంప్యూటర్లు వంటివి విరాళంగా అందించమన్నారు. కేంద్ర ప్రభుత్వం యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి చేస్తున్న ప్రయత్నానికి ఆటా తనవంతుగా ఎస్వీ యూనివర్సిటీ వేదికగా రూస సంయుక్త ఆధ్వర్యంలో స్టార్టర్ కంపెనీలతో ఇన్వెస్టర్ల మీట్ నిర్వహించామన్నారు. ఆదివారం ఎస్వీయూ రెండవ గేటు నుండి మహతి కళాక్షేత్రం వరకు ఆటా ఆధ్వర్యంలో వాక్ థాన్, వాగ్గేయకారుడు అన్నమయ్య సంకీర్తనలపై సంగీత పోటీలు, సాంస్కతిక సంబరాలను మహతి కళాక్షేత్రం వేదికగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు వచ్చిన దరఖాస్తులను మూడు కేటగిరీలుగా విభజించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అమెరికా తెలుగు అసోసియేషన్ కోశాధికారి సతీష్ రెడ్డి, ప్రతినిధులు పరమేష్ భీమిరెడ్డి, ఈశ్వర్ బండ, కాశిక్ కొత్త పాల్గొన్నారు.

తిరుపతివాసులకు 'ప్రత్యేక' దర్శనం కల్పించాలి

తిరుపతి టౌన్ : తిరుపతి ప్రజలకు ప్రత్యేక ప్రవేశ దర్శనం కల్పించాలని తిరుపతి నగర అధ్యక్షులు యార్లపల్లి గోపి ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ పరిపాలన భవనం ముందు నిరసన జరిగింది. ఈ సందర్భంగా యార్లపల్లి గోపి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రతి మంగళవారం స్థానికులకు ప్రత్యేక దర్శనం కల్పించామన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థానికులను పక్కనపెట్టి విఐపి లకు ఊడిగా చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు అడ్వకేట్ రవి, నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాగరాజు యాదవ్ పాల్గొన్నారు

'షిన్వా'తో మిరప తెగుళ్లకు చెక్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ మిరప సాగులో వచ్చే లెపిడోప్టెరాన్ తెగుళ్లు, త్రిప్‌లను ఎదుర్కోవడానికి 'షిన్వా' పురుగు మందు ఎంతగానో ఉపయోగపడనుందని ఐఐఎల్ సదరన్ రీజియన్ వైస్ ప్రెసిడెంట్ వీకే గార్గ్ తెలిపారు. భారతదేశంలో మిరప సాగు అనేక సవాళ్లను ఎదుర్కొంటుందన్నారు. తెగుళ్లు, వ్యాధులు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. త్రిప్స్ వంటి తెగుళ్లను పీల్చడం వల్ల కలిగే ముప్పును తక్షణం పరిష్కరించాలన్నారు. నిస్సాన్ కెమికల్ కార్పొరేషన్ జపాన్ పేటెంట్ కలిగిన క్రిమిసంహారక మందు అన్నారు. ఇది భారతదేశంలో ఇన్‌సెక్టిసైడ్స్ ఇండియా లిమిటెడ్ ద్వారా అమ్మకాలు జతుగున్నాయని తెలిపారు. అధిక, తక్కువ ఉష్ణోగ్రతలు రెండింటిలోనూ షిన్వా బాగా పని చేస్తుందన్నారు. వర్షాకాలంలో పిచికారీ చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

మృత్యువుతో పోరాడి అలిసిన నడిపిరెడ్డి

15 నెలల పాటు కోమాలోనే..

ప్రజాశక్తి - రామచంద్రాపురం



నడిపిరెడ్డి (ఫైల్‌ఫొటో)

మత్యువుతో పోరాడుతూ, 15 నెలలు కోమాలోనే జీవించి, చివరకు వైకుంఠ ఏకాదశి పర్వదినం శనివారం తెల్లవారుజామున నడిపి రెడ్డి (53)తుది శ్వాస విడిచారు. తిరుపతి జిల్లా రామచంద్రా పురం మండలం అనుప్పల్లి పంచాయతీ నెమళ్ళగుంటపల్లి గ్రామానికి చెందిన బోడిరెడ్డి నడిపి రెడ్డి అలియాస్ గుండయ్య (53) గత ఏడాది సెప్టెంబర్ 24న రేణిగుంట ఎయిర్పోర్ట్ నియర్ సెల్ కాన్ కంపెనీ దగ్గర శ్రీకాళహస్తి ప్రాంతం నుండి గొర్రెలను బొలోరో లగేజ్ వ్యాన్లో వేసుకుని తిరుపతికి వస్తుండగా, తిరుపతి నుండి శ్రీకాళహస్తి మార్గం వైపు వెళుతున్న ఎ.పి. 39- 2728 నంబర్ గల బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నడిపి రెడ్డి తలకు తీవ్ర గాయం కావడంతో కోమాలోకి వెళ్ళిపోయాడు. వెంటనే తిరుపతిలోని రేణిగుంట రోడ్ లో ఉన్న నారాయణాద్రి హాస్పిటల్‌లో సుమారు నాలుగు నెలలపాటు కుటుంబ సభ్యులు వైద్యం చేయించారు. నడిపి రెడ్డి పేద కుటుంబం అయినప్పటికీ భార్య వాణి, కుమారుడు చిరంజీవి రెడ్డి కుటుంబ పెద్దయిన నడిపి రెడ్డి ప్రాణాలు కాపాడుకోవడం కోసం అప్పుచేసి 30 లక్షలకు పైగా వైద్యానికి ఖర్చు చేశారు. అయినా నడిపి రెడ్డి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడలేదు. మంచానికే పరిమితం అయ్యాడు. భార్య వాణి తన భర్త నడిపి రెడ్డిని చంటి బిడ్డ లాగా కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చింది. ప్రమాదం జరిగినప్పటి నుండి 15 నెలలు కోమాలోనే ఉంటూ మత్యువుతో పోరాడి చనిపోవడంతో గ్రామం మొత్తం శోకసముద్రంలో మునిగిపోయింది.

ప్రమాదం ద్వారా తన తండ్రి నడిపి రెడ్డి మరణించినందున ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసుకోవడం కోసం, తన తండ్రి మతదేహానికి శవపరీక్షలు చేయించడం కోసం అనుమతి ఇవ్వాలని రేణిగుంట పోలీసులను, తిరుపతి లోని న్యాయస్థానాన్ని చిరంజీవి రెడ్డి శనివారం ఉదయం ఆశ్రయించినా సకాలంలో న్యాయం జరగలేదు. న్యాయం ఆలస్యం అవుతుందని న్యాయ సిబ్బంది తెలియజేయడంతో దిక్కుతోచని స్థితిలో తన తండ్రి అంత్యక్రియలను శనివారం సాయంత్రం నిర్వహించారు. వెదురుకుప్పం మండలం మాజీ జడ్పిటిసి గోవర్ధన్ రెడ్డి, ఆర్ సి పురం సింగల్ విండో చైర్మన్ వై చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్‌ఆర్సిపి సీనియర్ నాయకుడు టి వెంకటరెడ్డి, సర్పంచ్ గోవర్ధన్ యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్థిక వ్యవస్థలో అకౌంటెంట్స్ బాధ్యత కీలకం: భారతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

దేశ ఆర్థిక వ్యవస్థాభివృద్ధిలో కాస్ట్ అకౌంటెంట్స్ పాత్ర చాలా కీలకమైనదని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ దెపూరు భారతి అన్నారు. శనివారం మహిళా వర్సిటీ ఆడిటోరియంలో ఐసిఎంఎఐ తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో దక్షిణ భారత కాస్ట్ అకౌంటెంట్స్ విద్యార్థుల సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసి భారతి మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థ పురోగమన వద్ధిలో కొనసాగడానికి కాస్ట్ అకౌంటెంట్లు చాలా ముఖ్యమన్నారు. ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా రీజనల్ కౌన్సిల్ చైర్మన్ దివ్య అభిషేక్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల నిర్వహణ వలన మేక్ ఇన్ ఇండియా వంటి ప్రతిష్టాత్మక విధానాలను విద్యార్థులు అవగతం చేసుకొని భావితరాల్లో తమ వంతు బాధ్యతను నిర్వర్తించగలుగుతారన్నారు. ప్రముఖ మేనేజ్మెంట్ వక్త లావణ్య కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న టెక్నాలజీతో కాస్ట్ అకౌంటెంట్స్ విధానాలపై ఉదాహరణలతో కూడిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీఎంఏ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ వినయ్ రంజన్, సీఎంఏ సెక్రటరీ శ్రీనివాసరావు, సీఎంఏ తిరుపతి చాప్టర్ చైర్మన్ డాక్టర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఈసీఐ సమీక్షలో కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సమగ్ర ప్రణాళికతో సాధారణ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రతినిధుల బందం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ధర్మేంద్ర శర్మ సారథ్యంలోఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)– 2024, సాధారణ ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలపై నోవాటెల్ హోటల్ విజయవాడలో రెండు రోజుల పాటు సమీక్ష జరిగింది. రెండవ రోజు వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీ లతో సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు ధర్మేంద్ర శర్మ, నితీష్ వ్యాస్‌బీ స్వీప్ డైరెక్టర్ సంతోష్ అజ్మేరా, అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్‌తో పాటు ఏపీ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ముఖేష్ కుమార్ మీనా, అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఎంఎన్ హరేంధిర, జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఎ.వెంకటేశ్వరరావు, స్టేట్ పోలీస్ నోడల్ అధికారి వినీత్ బ్రిజ్‌లాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో తిరుపతి జిల్లాలో ఎన్నికల సన్నద్ధతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ కే. వెంకట రమణారెడ్డి, ఎస్.పి పరమేశ్వర రెడ్డి వివరించారు.

భక్తులతో కిక్కిరిసిన వైకుంఠుని సన్నిధి

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో వైకుంఠ ఏకాదశికి భక్తులతో పోటెత్తింది. అర్ధరాత్రి 12 గంటలకు తలుపులను తెరిచిన అర్చకులు పూజా కైంకర్యాలు నిర్వహించారు...దాదాపు మూడున్నర గంటల పాటు టిటిడి (వివిఐపిలు) ప్రముఖులకు దర్శనం కల్పించింది. నిర్దేశించిన సమయం కన్నా 45 నిమిషాల ముందే సర్వ దర్శనం, రూ 300 ప్రత్యేక దర్శనాల భక్తులను ఆలయంలోకి టిటిడి అనుమతించింది. తిరుమలలో వైకుంఠ ఉత్తర ద్వార దర్శన శోభ మొదలైంది. శ్రీవారి ఆలయాన్ని రకరకాల పుష్పాలతో టిటిడి ఉద్యానవన శాఖ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ప్రముఖులు, సామాన్య భక్తులతో తిరుమల కిటకిటలాడింది. భక్తుల తాకిడి దష్ట్యా ముందుగానే తిరుపతిలో టోకెన్లను సామాన్య భక్తులకు టిటిడి జారీ చేసింది. శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం కోసం ప్రముఖులు పోటెత్తారు. మూడున్నర గంటల పాటు న్యాయమూర్తులు, రాజకీయ నాయకులు స్వామివారి సేవలో తరించారు.

4,008 మంది ప్రముఖులకు దర్శనం

వైకుంఠ ఉత్తర ద్వార దర్శనానికి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసిందని, భక్తులు సంతప్తిగా దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకుందని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చెప్పారు. ఏ చిన్న సమస్య రాకుండా ఈ సారి పటిష్ఠమైన ఏర్పాట్లు చేశామని ఆయన అన్నారు. రూ 300 ప్రత్యేక దర్శనం, సర్వదర్శన టికెట్ల స్లాటెడ్ దర్శనాలను నిర్దేశించిన సమయం కంటే 45 నిమిషాల ముందే ప్రారంభించామని,తెల్లవారు జామున 1:30 నిమిషాలకు వైకుంఠ ఉత్తర ద్వార దర్శనాలకు భక్తులను అనుమతించామని టిటిడి ఈవో ధర్మారెడ్డి తెలిపారు. మొత్తం 4008 వీఐపీ బ్రేక్ దర్శన టిక్కెట్లు జారీ చేశామన్నారు. క్యూ లైనులోకి వచ్చే భక్తులకు పాలు, కాఫీ, అల్పాహారం అందిస్తున్నామన్నారు.

గోవిందుని సేవలో తరించిన ప్రముఖులు

వైకుంఠ ఉత్తర ద్వార దర్శనంలో ప్రముఖులు పాల్గొన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార మిశ్రా, సూర్య కాంత్, హిమ కోహ్లీ, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవీంద్ర బాబు, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్. ఎల్ భట్టి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్ సుందర్, కర్ణాటక రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి తారాల రాజశేఖర్, రాష్ట్ర మంత్రులు అంబటి రాంబాబు, కారుమూరి నాగేశ్వరరావు, గుడివాడ అమర్నాథ్ ,ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, శాసన ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి, ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, ఉష శ్రీ చరణ్, మేరుగు నాగార్జున, చెల్లబోయిన వేణుగోపాలకష్ణ, సినీ నటుడు నిర్మాత బండ్ల గణేష్, భాజపా నేత సిఎం రమేష్, వైకాపా ఎంపి రఘురామ కష్ణంరాజు, మంత్రి రోజా, తెదేపా రాజ్యసభ సభ్యులు కనకమేడల, తెదేపా నేతలు కేశినేని నాని, రామ్మోహన్ నాయుడు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఉన్నారు.

వేడుకగా స్వర్ణ రథోత్సవం

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం స్వర్ణరథోత్సవం వేడుకగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారు రథాన్ని అధిరోహించి నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన స్వర్ణరథాన్ని టీటీడీ మహిళా ఉద్యోగులతో పాటు పలువురు మహిళలు గోవిందనామస్మరణతో, భక్తిశ్రద్ధలతో లాగారు. స్వర్ణరథోత్సవాన్ని గ్యాలరీల్లో వేచి ఉన్న భక్తులు దర్శించుకున్నారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి, జేఈవో లు సదా భార్గవి, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

వికృతమాలలో భక్తులకు భోజన ఏర్పాట్లు : హరిప్రసాద్

రేణిగుంట మండల పరిధిలోని వికతమాలలో వెలసిన శ్రీ సంతాన సంపద వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయని ఆలయ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన వైకుంఠ ద్వారం ద్వారా దాదాపు 30 వేల మంది శ్రీవారి భక్తులు దర్శనం చేసుకున్నారన్నారు. దర్శనానికి వచ్చిన భక్తాదులకు కనువిందు అయిన భోజనాలతో పాటుగా తీర్థప్రసాదాలను అందించామన్నారు. ఆలయంలో చేపట్టిన ముఖద్వార మండపం, గాలిగోపురం నిర్మాణాలు త్వరలో పూర్తి చేస్తామన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన 2024 సంవత్సరపు కాలమాన పట్టికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర ప్రసాద్, శివ ప్రసాద్, మునికష్ణయ్య, బాబూజీ స్కూల్స్ చైర్మన్ బాలాజీ నాయుడు, మాజీ సర్పంచ్ హేమాక్షి, యుగంధర్, మురళి, శేఖర్ పాల్గొన్నారు.

'ప్రతిభ'కు ప్రోత్సాహం... 'బాలోత్సవం'

ప్రజాదృష్టి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

చదువుతో పాటు క్రీడలు, సాంస్కతిక కార్యక్రమాలు, సంగీతం తదితరాల్లో సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతూ తమ ప్రతిభను చూపేందుకు ఎదురు చూస్తున్న పిల్లలకు బాలోత్సవం వేదికయ్యింది. ప్రాథమిక విద్యాభ్యాసం నుంచి హై స్కూల్ విద్యార్థుల వరకూ వివిధ రంగాలలో పోటీలు నిర్వహించి, వారిలోని సజనాత్మకతను వెలికి తీసేందుకు తిరుపతి బాలోత్సవం నడుము కట్టింది. తిరుపతి యశోదనగర్ కేంద్రంగా బాలోత్సవం అందుకు శ్రీకారం చుట్టింది. 2022, డిసెంబర్‌లో తిరుపతిలో మొట్టమొదటిసారిగా బాలోత్సవం ద్వారా పిల్లల పండగ నిర్వహించింది. వేలాది మంది విద్యార్థులు ఇందులో పాల్గొని, తమలోని నైపుణ్యాన్ని బహిర్గత పరిచారు. దీంతో విద్యార్థుల్లో చదువుతో పాటు మరో కోణం వెలికి తీసేందుకు ఆస్కారం ఏర్పడింది. మొదట ఏడాది కలిగిన ఆదరణ, ఉత్సాహంతో రెండో ఏడాది మరింత ఎక్కువ స్థాయిలో పిల్లల పండుగ నిర్వహించాలని బాలోత్సవ కమిటీ నిర్ణయించింది. అనుకున్నది తడువుగా కొన్ని నెలల పాటు తాము అనుకున్న ప్రణాళికను అమలు చేస్తూ ప్రతి పాఠశాల తిరిగి, ఉపాధ్యాయులకు విద్యార్థులకు ఈ పోటీల గురించి వివరించారు. అందుకు వారు మరింత ఉత్సాహం చూపి పాల్గొనేందుకు సిద్ధం కావడంతో కొంతమంది దాతల సహకారంతో పిల్లల పండగకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 16, 17 తేదీల్లో శ్రీ పండిట్ జవహర్లాల్ నెహ్రూ మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ ప్రాంగణంలో పోటీలు చేపట్టారు. సుమారు 5 విభాగాల్లో 29 అంశాలలో పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం, వ్యాసరచన (తెలుగు),(ఇంగ్లీష్), కథ రచన (తెలుగు), స్పెల్ బి ఇంగ్లీష్, తెలుగు డిక్టేషన్, మ్యాప్, మెమొరీ టెస్ట్, సైన్స్ ఎగ్జిబిషన్, తెలుగులో మాట్లాడడం, వక్తృత్వం (తెలుగు), (ఇంగ్లీష్) పద్య భావం, కథ చెబుతాను కొడతారా, కవితా రచన, మట్టితో బొమ్మలు, బెస్ట్ ఫ్రం వేస్ట్, ఏకపాత్రాభినయం, క్లాసికల్ డాన్స్ సోలో, దేశభక్తి గీతాలాపన, జానపద నత్యం, ఇన్రూట్స్ మెంటల్, యోగ, శాస్త్రీయ సంగీతం, జానపద గీతాలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, చెస్, త్రైక్వాండ్ అంశాలలో పోటీలు నిర్వహించారు. విద్యార్థులను నాలుగు విభాగాలుగా విభజించారు. ఈ పోటీలకు వందకు పైగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 5వేల మందికి పైగా విద్యార్థులు హాజరై తమ ప్రతిభను చాటారు. తిరుపతి కేంద్రంగా రెండు రోజులపాటు పిల్లల పండగ అత్యంత వేడుకగా ఉత్సాహవంతమైన వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పోటాపోటీగా ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభకు పదును పెట్టారు. న్యాయ నిర్ణేతలను సైతం అవాక్కుపరిచేలా విద్యార్థులు పోటీ పడడం గమనార్హం. తిరపతి బాలోత్సవం గౌరవ అధ్యక్షులు టెంకాయల దామోదరం, అధ్యక్షులు నడ్డా నారాయణ, కార్యదర్శి మల్లారపు నాగర్జున,కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు పిల్లలకు వివిధ రంగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రాంగణం మొత్తం తిరునాళ్లను తలపించింది. జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. పౌరాణిక రాజుల వస్త్రధారులతోపాటు, సరికొత్త డిజైనర్లతో కూడిన వస్త్రాలతో ఫాన్సీ డ్రెస్ పోటీలను వేడెక్కించారు. ఇది కదా నిజమైన పిల్లల పండుగ అంటూ అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ బహిరంగంగానే పొగడ్తలతో ముంచెత్తారు.

అన్నా చెల్లెలను సత్కరిస్తున్న పలువురు ఉపాధ్యాయులు

అన్నాచెల్లెళ్లకు ఘన సన్మానం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ఇటీవల నిర్వహించిన ఎస్‌ఐ పరీక్షల్లో చిన్నగొట్టిగల్లు మండలంకి చెందిన అన్నా, చెల్లెలు ఎస్‌ఐ ఉద్యోగం సాధించారు. చిన్నగొట్టిగల్లు మండలం ఎగువురుకు చెందిన పోకల తేజ, హరిత అన్నాచెల్లెలు. వీరి తండ్రి చెన్నకేశవులు అనారోగ్యంతో మృతి చెందారు. తల్లి గీతాసుధ ప్రస్తుతం భాకరాపేట జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. తేజ గంగాధరనెల్లూరు సచివాలయంలో కార్యదర్శిగా ఉద్యోగం చేశారు. అన్న, చెల్లెలు ఉన్నత ఉద్యోగం చేయాలనే పట్టుదలతో ఇటీవల ఎస్‌ఐ పరీక్షలు రాశారు. ఫలితాల్లో ఇద్దరూ ఉత్తీర్ణత సాధించారు. వీరిని శనివారం భాకరాపేట సర్పంచ్ భూపాల్, ఎఈవో బాలసుబ్రమణ్యం, నాయకులు సీతాపతి, గురుశంకర్, రచయిత ఆణివాణి, సాయిరాం స్కూల్ జనార్ధన్‌రెడ్డి, గీతాంజలి స్కూల్ ప్రిన్సిపల్ గిరికుమార్‌రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు అభినందించి సత్కరించారు.

శోభను సన్మానిస్తున్న నాయకులు

ఎస్‌ఐ పరీక్షల్లో సత్తా చాటిన వలంటీర్‌కి సన్మానం

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: పేదింట జన్మించి వలంటీర్‌గా విధుల్లో ఉంటూ ఎస్‌ఐ ఉద్యోగం సాధించిన వలంటీర్ శోభ ను పలువురు అభినందించారు. శనివారం సర్పంచ్ మంజులారమేష్, సచివాలయ సిబ్బంది, తోటి వలంటీర్లు ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత విద్య పూర్తి చేసుకొని వలంటీర్‌గా విధులు నిర్వహిస్తోంది. కాగా ఉన్నత ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో ఎస్‌ఐ పరీక్షలు రాసి మంచి ఫలితాలు రాబట్టింది. దీంతో ఆమె పలువురికి ఆదర్శంగా నిలిచింది.

రైతులను సత్కరించి బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్

రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారిస్తే మెరుగైన దిగుబడులు సాధ్యమవుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆరు మంది ఉత్తమ రైతులను సన్మానించి బహుమతులు అందజేశారు. ఆ తరువాత కన్స్యూమర్ క్లబ్, కామర్స్ విభాగం నిర్వహించిన వినియోగదారుల హక్కుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన వినియోగదారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తికేయరెడ్డి, సత్యవేడు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రమణ్యం, నరసింహులు. వరలక్ష్మి, బాబురావు, వీరయ్య, వాణిశ్రీ, హరిబాబు, నాగేశ్వరరావు, సుజన తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రమాదానికి గురైన బైక్ (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన రమణయ్య

ప్రజాశక్తి-దొరవారిసత్రం: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం నాయుడుపేట రహదారిపై చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని పాలిచెర్లపాడు గ్రామానికి చెందిన దినసరి కూలీ తాండూరు రమణయ్య(59) పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంలో తిరిగొస్తుండగా వైనంబాకం క్రాస్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న హైవే సిబ్బంది, పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. రమణయ్య మృతితో కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరైయ్యారు.

బైక్ చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: కొంత కాలంగా బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో వివరాలను వెల్లడించారు. గత కొంతకాలంగా ద్విచక్రవాహనాల చోరీలు ఎక్కువ కావడంతో నిఘా పెంచామన్నారు. కడూరు క్రాస్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా పోలీసులను చూసి పరారవుతున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీలు చేస్తున్నట్లు అంగీకరించారన్నారు. కంచెరపాలెంకు చెందిన సుకుమార్, ఇందిరానగర్ పంచాయతీ పద్మావతిపురంకు చెందిన మోహన్‌గా గుర్తించామన్నారు. వారి వద్ద నుండి మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రమాదంలో మృతి చెందిన శీను

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఆర్టీసీ బస్సు ఢీకొని బైక్‌పై వెళుతున్న వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన గూడూరు సమీపంలో చోటుచేసుకొంది. స్థానికులు కథనం మేరకు.. చెన్నూరుకు చెందిన శీను ద్విచక్రవాహనంపై గూడూరుకు వస్తుండగా రెండోపట్టణ పరిధిలోని కోర్టు సెంటర్ సమీపంలో గూడూరు నుండి రాపూరుకు వెళుతున్న రాపూరు డిపో ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో శీను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకొని సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

బాధితుడు రామయ్య

ప్రజాశక్తి-బాలాయపల్లి: కులం పేరుతో దూషించి దౌర్జన్యం చేసి దాడిచేశారని ఓ బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. మండలంలోని కాలగంధ గ్రామానికి చెందిన అక్కుర్తి రామయ్య సంఘటనపై శుక్రవారం బాలాయపల్లి పోలీసులకు పిర్యాదు చేసినట్లు శనివారం తెలిపారు. బాధితులు రామయ్య మాట్లాడుతూ తాను ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాని, ట్రాక్టర్ తీసుకుని పొలం దున్నడానికి వెళుతుండగా మార్గమధ్యలో అదే గ్రామానికి చెందిన సర్వేపల్లి వెంకట సురేష్, అతని భార్య వెంకట రమణమ్మ, దాసరి వెంకట సుబ్బమ్మ ట్రాక్టర్‌ని అడ్డుకుని ఈ దారిగుండా వెల్లడానికి వీళలేదని కులం పేరుతో దూషించి, భూతులు తిడుతూ కింద పడేసి కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో భయబ్రాంతులకు గురై వారి వద్ద నుండి తప్పించుకుని పోలీసులకు పిర్యాదు చేసినట్లు తెలిపారు. తనపై దౌర్జన్యం చేసి కులం పేరుతో దూషించి, దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు మున్సిపాలిటీ కళ్యాణపురంలో ఓ అద్దె ఇంట్లో ఉంటున్న శ్రీదేవి శుక్రవారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతి చెందిన శ్రీదేవి భర్త తిరుమలలో దుకాణం నడుపుతున్నట్లు, కుమారుడు కుమార్తె, చెన్నై బెంగళూరులో ఉన్నట్లు వెల్లడించారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పాకాల: స్కైలైన్ అక్సర్డ్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ పాలకూరి నాగేంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్టర్ నారాయణద్రి, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ బృందం వైద్య సేవలు అందిస్తారన్నారు. వసంతాపురంలోని ఎంపీపీ స్కూల్ కొత్తకోట నందు నిర్వహించబోయే ఈ వైద్య శిబిరాన్ని కొత్తకోట పరిసర ప్రాంతాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో బయోటెక్నాలజీ, అప్లైడ్ మైక్రోబయాలజీ విభాగం సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ బయోటెక్ మైక్రోకాన్ షేపింగ్ ది సస్టైనబుల్ ఫ్యూచర్ సదస్సు ముగిసింది. కార్యక్రమాన్ని మహారాష్ట్ర అంబేద్కర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కేద్కర్‌తో లీడ్ చర్చలతో ప్రారంభించినట్లు ఆయన వివరించారు. ప్రొఫెసర్ డి.భారతి, మురళీమోహన్, మాజీ రిజిస్ట్రార్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయమాధురి, ప్రొఫెసర్ సువర్ణలతాదేవి, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ పి.జ్యోత్స్న, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-వెంకటగిరి: నిరుపేద చేనేత కుటుంబానికి చెందిన కొండయ్య గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ శంకరయ్య ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. నాయకులు రవణమ్మ, సీనయ్య, రత్నం రాజు, గోపాల్‌రాజు, నారాయణ పాల్గొన్నారు.

తుపాను బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: తుపాను బాధితులకు నవజీవన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసరాలను పంపిణీ చేశారు. మండలంలోని కాంపాలెం, అంబూరు, నీర్పాకోట, కనమనంజేడు గ్రామాలకు చెందిన సుమారు 150 కుటుంబాలకు అందజేశారు. శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం ద్వారా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నవజీవన్ ఆర్గనేజేషన్ అధ్యక్షులు కాల్వపల్లి సహదేవయ్య, ఎంపీడీవో సాయిలహరి, శ్రీనివాసులు, రవి, డేవిడ్, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్ బాల్ శిక్షణా శిబిరం

ప్రజాశక్తి-గూడూరు రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 19 నుండి 23వ తేదీ వరకు ఫుట్ బాల్ శిక్షణా శిబిరం నిర్వహించారు. శిబిరానికి ప్రధాన శిక్షకులుగా కళాశాల వ్యాయామ అధ్యాపకులు నారాయణరాజు, సహాయకులుగా జానకిరామయ్యలు వ్యవహరించారు. వీరు ఈనెల 25న చెన్నైలో జరిగే అంతర విశ్వవిద్యాలయాల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

క్రీడల్లో సత్తా చాటిన ఎస్వీ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-క్యాంపస్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ అనుబంధ మహానంది వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో మూడు రోజులపాటు జరిగిన పురుషుల విభాగ క్రీడల్లో తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల విజేతగా నిలిచి ఛాంపియన్‌లుగా నిలిచారు. నవంబర్ 28 నుండి ప్రారంభమైన అంతర్ వ్యవసాయ కళాశాల రాష్ట్రస్థాయి పోటీల్లో క్రికెట్ ఫుట్బాల్, క్యారమ్స్, బాస్కెట్బాల్, చెస్, అథ్లెటిక్స్, రన్నింగ్ ట్రిబుల్ జంప్, తిరుపతి ఎస్వీ కాలేజ్ విజేతలుగా నిలిచాయి. టేబుల్ టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్, విభాగంలో రన్నర్స్‌గా నిలిచి విజయం సాధించారు. తదితర క్రీడల్లో క్రీడాకారులు సత్తా చాటి తిరుపతి ఎస్వీ అగ్రికల్చర్ కాలేజ్ 35 పాయింట్లకు గాను 31 సాధించి ఓవరాల్ ఛాంపియన్షిప్‌ను పొందారు. విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్షిప్‌ను ఎస్వీ అగ్రికల్చర్ కాలేజ్ అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డికి అందజేశారు. వారిని ఉద్దేశించి డీన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ హెడ్ డాక్టర్ ఆర్.రవికాంత్ రెడ్డి, డాక్టర్ చలం, డాక్టర్ గురువిరెడ్డి, ప్రొఫెసర్ నిర్మల్, రాజేశ్వరి పాల్గొన్నారు.

వస్తు వినియోగంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రతి వస్తువు కొనుగోలు, వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ వైద్యుడు, వ్యాపారవేత్త డాక్టర్ పోతుగుంట రాజేష్ నాయుడు అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆశ్ర ఆధ్వర్యంలో శనివారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజేష్ నాయుడు మాట్లాడుతూ వినియోగదారుల చట్టం-2019పైన అవగాహన కల్పించారు. అశ్రా జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది మునిశేఖర్, ప్రిన్సిపాల్ న్నాగ సుబ్బారెడ్డి, పీఈటీ క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్రూవల్ లేఔట్‌లే కొనాలి: కమిషనర్

ప్రజాశక్తి-వెంకటగిరి: మున్సిపల్ పరిధిలో అప్రూవల్ లేఔట్‌లు మాత్రమే కొనుగోలు చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా లేఔట్లు పుట్టగొడుగులు లాగా పుట్టుకొచ్చాయన్నారు. పూర్తి వివరాలను చూసుకొనే ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేయాలని సూచించారు. పట్టణంలో సుమారు 20 అప్రూవల్ లేని లేఔట్లలో రాళ్లను మున్సిపల్ సిబ్బంది టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె విజయవంతం చేయండి

గూడూరు టౌన్‌లో

సూళ్లూరుపేటలో

వెంకటగిరిలో

ప్రజాశక్తి-గూడూరు టౌన్: మున్సిపల్ కార్మికుల ప్రధాన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఏపీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ ('అనుబంధం) జిల్లా కార్యదర్శి బి.గోపినాథ్ తెలిపారు. శనివారం సిఐటీయూ పట్టణ అధ్యక్షులు బివి రమణయ్య జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో బైకల ర్యాలీ రెండవ పట్టణం, ఒకటో పట్టణంలోని పలు ప్రాంతాల్లో నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుండి సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. ప్రజాసంఘాలు, రాజకీయపార్టీలు, తమకు పూర్తి మద్దతు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో గూడూర్ డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, కార్యదర్శి సురేష్, మున్సిపల్ సంఘం పట్టణ కార్యదర్శి ధారా కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు (పి.పి)మురళి, ప్రసాద్, రాజేష్, మణి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: మున్సిపల్ కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. మున్సిపల్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు చాపల వెంకటేశ్వర్లు, రామచంద్రయ్య, నెలవల సుబ్రహ్మణ్యం, రాయలమ్మ, రహేళమ్మ, శ్రీను, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: ఆఫ్కాస్ ఉద్యోగుల్ని పర్మినెంట్ చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో వెంకటగిరి సీఐటీయూ ఆఫీసు వద్దనుండి బైక్ ర్యాలీ బయలుదేరి రాజా వీధి ,పాత బస్టాండు, ఎంపీడీవో ఆఫీసు, ఆర్టీసీ బస్టాండు, క్రాస్ రోడ్డు, బంగారు పేట వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు పట్టణ అధ్యక్షులు టి.సుబ్బయ్య, ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: సిఐటియు ఆధ్వర్యములో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజ మున్సిపల్ కార్మికుల గౌరవ అధ్యక్షులు కె.సాంబశివయ్య, సిపియమ్ నాయకులు పద్మనాభయ్య, చంద్రశేఖర్, నాయకులు రమణయ్య, లక్ష్మయ్య పి.మనోహర్, మున్సిపల్ భవన నిర్మాణ కార్మికుల జిల్లా అధ్యక్షులు సుంకర అల్లెయ్య, మున్సిపల్ కార్మిక అధ్యక్ష కార్యదర్శులు రామయ్య, పళని, చంగయ్య, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరం : డీఈవో శేఖర్

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: యువత మానసిక ఉల్లాసని క్రీడలు ఎంతో అవసరమని డీఈవో శేఖర్ అన్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద ర్యాలీ చేసి మానవహారం చేపట్టారు. మునిసిపల్ కమిషనర్ కె.ఎల్.ఎన్.రెడ్డి, చైర్మన్ హరి, ఎంపీడీవో ప్రసాద్, ఎంపీపీ మునివేలమ్మ, ఎంఈవో తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం. జయప్రకాష్, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

పిచ్చాటూరు: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను పండుగలా నిర్వహిద్దామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలునిచ్చారు. శనివారం ఆయన పిచ్చాటూరులో పర్యటించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలకు సంబంధించి మీడియాతో మాట్లాడారు. ఆ తరువాత మరోచోట జరిగిన కార్యక్రమంలో బాధితులకు సీఎం రిలీఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు చలపతిరాజు, ఉపాధ్యక్షుడు రమేష్‌రాజు, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్‌నాయుడు, సుబ్రమణ్యంరెడ్డి, బాబు రెడ్డి, మోహన్ పాల్గొన్నారు. ఆ తరువాత కీలపూడి వీరాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు.

బుచ్చినాయుడు కండ్రిగ: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీడీవో సాయి లహరి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రనాథ్, హెచ్ఎం రమణయ్య, పిడి మస్తానయ్య, అధికారులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: యోగా వల్ల ఆరోగ్యంతో పాటు జ్ఞానం పెరుగుతుందని డిఎల్‌పివో వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో స్త్రీ శక్తి భవనంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఆడదాం ఆంధ్రకు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలరాణి, హెచ్ఎం రవీంద్రరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పుత్తూరుటౌన్‌లో

గూడూరుటౌన్: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలపై శనివారం గూడూరు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ మహిళల టోర్నమెంట్ను నిర్వహించేందుకు ఏర్పాట్లు ఇద్దం చేసినట్లు ఉపకులపతి ఆచార్య డి. భారతి పేర్కొన్నారు. శనివారం ఉపకులపతి చాంబర్లో పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. డిసెంబర్ 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ మహిళల టోర్నమెంట్ను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. దక్షిణ భారతదేశంలోని ఆరు రాష్ట్రాల నుంచి 89 విశ్వవిద్యాలయాలు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాల విద్యార్థినీలు పాల్గొంటున్నారని వెల్లడించారు. ప్రతి జట్టులో 12 మంది ఆటగాళ్లు, ఒక కోచ్, ఒక మేనేజర్, ఒక అటెండర్ ఉంటారని అన్నారు. మొత్తం 267 మంది సభ్యులు, 1068 మంది క్రీడాకారులు ఈ మెగా టోర్నమెంట్లో పాల్గొంటున్నారన్నారు. ఈ క్రీడాకారులకు, కోచ్, మేనేజర్లకు వసతి సౌకర్యాలను మంజీరా, స్రవంతి గౌతమి హాస్టల్స్‌లలో ఏర్పాటు చేశామన్నారు. మ్యాచ్ నిర్వహణకు దాదాపు 40మంది జాతీయస్థాయి రెఫరీలు వస్తున్నారన్నారు. డాక్టర్ ఎస్ సెల్వకుమార్, బిఎస్ అబ్దుల్ రెహమాన్‌లు ఏఐయు ద్వారా పరిశీలన నియమింపబడ్డారని వెల్లడించారు. మేనేజర్ల సమావేశం డిసెంబర్ 26న సాయంత్రం 5గంటలకు నిర్వహించబడుతుందన్నారు. పాల్గొనేవారి కోసం 4 ప్రధాన వాలీబాల్ కోర్టులు, 2 ప్రాక్టీస్ కోర్టులు సిద్ధం చేయబడ్డాయని తెలిపారు. క్యాంపస్‌లో పాల్గొనే వారందరికీ, సిబ్బందికి భోజన ఏర్పాట్లు చేశారు. ఇన్ఫర్మేషన్ డెస్క్, మెడికల్, అంబులెన్స్ సౌకర్యాలు, భద్రత, ఇతర సౌకర్యాలు మా క్యాంపస్‌లో జరగబోయే ఈ ప్రతిష్టాత్మకమైన ఈవెంట్‌ను సజావుగా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాయని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ రజిని, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం హెడ్ ప్రొఫెసర్ జి.సారా సరోజిని తెలిపారు.

అటల్ ఫ్యాకల్టి డెవలప్మెంట్ ప్రోగ్రాం విజయవంతం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: స్థానిక ఆదిశంకర కళాశాలలో ఆటల్ ఫ్యాకల్టి డెవలప్‌మెంట్‌లో భాగంగా జె.ఎన్.టి.యు ఈ.సి. హెచ్‌వోడీ విష్ణువర్ధన్ హైపర్ స్పెక్ట్రల్ ఇమేజ్ ప్రాసెసింగ్ అనే అంశాన్ని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయ మాట్లడుతూ ఇటువంటి ప్రోగ్రామ్స్ ద్వార నూతన విషయాలను తెలుసుకొని నైపుణ్యాభివృద్ధి పెంపొందించు కోవచ్చు అన్నారు. విద్యార్థులు ఈ ప్రోగ్రామ్స్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎ.ఐ.సి.టి. ఇ.కి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ మోహన్, అధ్యాపకులు రాజయ్య, అమరేంద్ర, జనార్ధన్, సాయికుమార్, చెంచుకృష్ణ, ఏ.ఓ.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయమా లేక వైసీపీ కార్యాలయమా..? : విద్యార్థి సంఘాలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-క్యాంపస్: అఖిల భారత విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో శనివారం ఎస్వీయూలోని అన్నమయ్య భవన్ వద్ద అఖిలపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్న, కార్యదర్శి సుందర్ మాట్లాడుతూ రోజురోజుకు విశ్వవిద్యాలయాలలో విద్యా వ్యవస్థని పూర్తిగా నాశనం చేయడానికి రాష్ట్రంలో ఉండే హైయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ హేమ్చుందర్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీని వైసిపి కార్యాలయాలలుగా మార్చార న్నారు. గత నాలుగేళ్లుగా విశ్వవిద్యాలయాల్లో వైసీపీ నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లు వేస్తున్నటువంటి విషయాన్ని పదే పదే యూనివర్సిటీ ఉన్నతాధి కారులకు విన్నపించినప్పటికీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేసే వరకు ఉద్యమం

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-తిరుపతిటౌన్: సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నేతలు మాధవయ్య తెలిపారు. తిరుపతి నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు భారీ నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నల్లరిబ్బులలో ధరించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం నెరవేర్చలేదన్నారు. ఉద్యోగుల సమస్యలను నెరవేర్చే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రదీప్‌కుమార్, మునికృష్ణ, వాసవి, మోహన్, ధనపాల్, జనార్ధన్, లలిత, ప్రసాద్, ప్రశాంత్, శివ, వేణు, రమణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన శ్రీకాళహస్తి విద్యార్థులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జెడ్పి ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పలు ఆవిష్కరణలు అందర్నీ ఆకర్షించాయి. అయితే వీటిల్లో జడ్పీహెచ్స్ వరదయ్యపాలెం భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు, అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇంచార్జ్ కందేరి మేఘనాధ్ ఉపాధ్యాయ విభాగంలో ఆవిష్కరించిన స్మార్ట్ బ్లైండ్ స్టిక్ రెండో స్థానంలో నిలిచి ఉత్తమ బహుమతిని అందుకుంది. జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ శేఖర్, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, జిల్లా సైన్స్ సమన్వయకర్త ధనంజయ లు మేఘనాథ్ ను అభినందించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. స్మార్ట్ బ్లైండ్ స్టిక్ లో ఆర్డినో యూఎన్వో కోడింగ్ సౌకర్యం ఉండటంతో దివ్యాంగులు ఇతరుల సహాయం లేకుండా నడవడానికి వీలవుతుంది. కేవలం వెయ్యి రూపాయలతో ఈ స్టిక్ ను ఉపయోగించుకుని దివ్యాంగులు సులభంగా నడవవచ్చు. మేఘనాథ్ ఆవిష్కరణ రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు కూడా ఎంపిక కావడం గమనార్హం.

మానవ జీవితంలో గణిత శాస్త్రానికి ఆవశ్యకత ఉంది : రిజిస్ట్రార్

రామానుజన్‌కు పూల మాలలు వేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-క్యాంపస్: మానవ జీవితంలో గణిత శాస్త్రానికి ప్రత్యేకతమైన ఆవశ్యకత ఉందని ఎస్వీయూలో ఆచార్య ఓయండి హుస్సేన్ పేర్కొన్నారు. గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రముఖ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని డిసెంబర్ 22వ తేదీ నుంచి రెండు రోజుల జాతీయ గణిత దినోత్సవంతో పాటు జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ ముగింపు సమావేశానికి ఆచార్య జి.సరోజమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సరోజమ్మ మాటాడుతూ ప్రత్యేక అంశాలను గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ఆచార్య డి.భారతి, సైన్స్ కళాశాల ప్రధాన ఆచార్య ప్రిన్సిపల్ ఆచార్య కేటి రామకృష్ణారెడ్డి, ఆచార్య నాగమునిరెడ్డి, సైన్స్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ ఆచార్య కే రామకృష్ణ ప్రసాద్, ఆచార్య భాస్కర్ రెడ్డి, ఆచార్య శ్రీనాథ్, ఆచార్య కేఎం భాను, డాక్టర్ జయసుబ్బారెడ్డి, డాక్టర్ సుధాకరయ్య, అక్కడమిక్ కన్సల్టెంట్లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

25 నుంచి రుమటాలజీ ఓపి వైద్య సేవలు పునః ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతిసిటీ: స్విమ్స్‌లో రుమటాలజి ఓ.పి.వైద్య సేవలును ఈనెల 25వ తేదీ నుంచి పున:ప్రారంభం చేయనున్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ రామ్ ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ప్రొపెసర డాక్టర్ జె.శరత్ రుమటాలజి విభాగం ఆధ్వర్యంలో డిసెంబర్ 25వ తేది సోమవారం నుండి వైద్య సేవలు పునఃప్రారంభంకానున్నాయి. పేషంట్ల సౌకర్యార్థం రుమటాలజి ఓ.పి వైద్య సేవలు శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల హాస్పిటల్‌లోని (ఎండోక్రైనాలజి) ఓ.పి.బ్లాక్ రూమ్ నెం:18లో రుమటాలజి ఓ.పి.సేవలు అందుబాటులో వుంటాయి. రోజు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల లోపు ఓ.పి. నమోదు చేసుకొని రుమటాలజి వైద్య సేవలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

శివయ్య సన్నిదిలో కళాకారులకు అవకాశం కల్పించండి

ప్రజాశక్తి నాయుడుపేట: శ్రీకాళహస్తి ఆలయంలో శివనామ సంకీర్తనలు ఆలపించేందుకు జానపద వృత్తి కళాకారులకు అవకాశం కల్పించాలని జానపద వృత్తి కళాకారుల సంఘం జిల్లా కన్వీనర్ సంక్రాంతి వెంకటయ్య అన్నారు. శనివారం నాయుడుపేట మండలం తిమ్మాజీ కండ్రిగ దుర్గమ్మ ఆలయం లో జానపద కళాకారుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయుడుపేట, ఓజిలి, పెళ్ళకూరు మండల జానపద వృత్తి కళాకారులు పాల్గొన్నారు. తిరుపతి జిల్లా పరిధిలో గ్రామీణ ప్రాంతాల నుండి వేలాది సంఖ్యలో భక్త జనకోటి సందోహంతో జనవరి 4న శ్రీకాళహస్తీశ్వర ఆలయం వద్ద వీధి నాటకం, వీధి బోగాతం హరికథ బుర్రకథ కోలాటం జడ కోలాటం, చెక్కభజన తదితర కళారూపాలను విచిత్ర వేషదారులతో వేస్తూ శివుని పాదాల చెంత ప్రదర్శించి జరుగుతుందని విజయశంకర స్వామి తెలిపారు. జిల్లా కన్వీనర్ వెంకటయ్య మాట్లాడుతూ వార్షిక ఆదాయం రూ.100కోట్లకు పైగా దేవస్థానానికి వస్తుందని 2శాతం కళాకారులకు కేటాయించి 365 రోజులు నిత్యం అఖండ శివనామ సంకీర్తనం జరిగే విధంగా పాలక మండలి నిర్ణయం తీసుకోవాలన్నారు. కళలు ప్రదర్శించే కళాకారులకు పర్మినెంట్ ధూర్జటి కళాక్షేత్రాన్ని నిర్మించాలని భజనలు చేసే కళాకారులకు వేదికను ఏర్పాటు చేయాలన్నారు.

స్త్రీ, శిశు మరణాలు తగ్గించడమే లక్ష్యం

ప్రజాశక్తి-బాలాయపల్లి: రక్తహీనతతో పిల్లలు, గర్భవతులు బాలింతలు మరణాలు తగ్గించడమే లక్ష్యంగా ఆరోగ్య శాఖ సిబ్బంది పని చేయాలని జిల్లా టాస్క్ ఫోర్స్ డిపిఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కామకూరు, బాలాయపల్లి సచివాలయాలలో రక్తహీనత ఉన్న పిల్లలను గర్భవతులను గుర్తించి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి నాగేంద్రకుమార్, డిపిహెచ్ఎన్ఓ బేబిరాణి, డిపిఓ ప్రకాష్, స్థానిక ప్రాథమిక ఆరోగ్య శాఖ అధికారిని ప్రమీల సూపర్వైజర్ రాజేశ్వరి, ఏఎన్ఎం మహిత, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గోవింద భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి-తిరుపతిటౌన్: తిరుపతి అలిపిరి నందు కాలినడకన తిరుమల చేరే భక్తులకు లయన్స్ క్లబ్ అఫ్ తిరుపతి సెవెన్ హి ల్స్ ఆధ్వర్యంలో అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు 500 మంది భక్తులకు అన్నదానం చేసారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి జగన్నాధం కోశాధికారి బెల్లం కొండ సురేష్, కార్యదర్శి జగన్నాధం, కోశాధికారి బెల్లంకొండ సురేష్, బాసికర్ల రఘు, లక్ష్మి , రోహిత్ బాబు తదితరులు పాల్గొన్నారు.